చిన్నలింగాపూర్‌లో మరమ్మతు చేసిన బోరు వద్ద గ్రామ మహిళలు

చిన్నలింగాపూర్‌కు నీళ్లొచ్చినయ్

సమస్యను పరిష్కరించిన అధికారులు

నమస్తే ఎఫెక్ట్

సిరిసిల్ల రూరల్, సెప్టెంబర్ 20: తంగళ్లపల్లి మండలం చిన్నలింగాపూర్‌లో నీటి సమస్య తీరింది. మూడు నెలలుగా నీటి సమస్య ఉన్నా.. పంచాయతీ కార్యదర్శి, అధికారులు పట్టించుకోవడం లేదని గురువారం గ్రామ మహిళలు ఖాళీ బిందెలతో పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపారు. ఈ క్రమంలో 'మంచినీళ్లు మహో ప్రభో' శీర్షికన శుక్రవారం 'నమస్తే తెలంగాణ' మెయిన్ 10వ పేజీలో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా స్పందించారు. గ్రామంలోని బోర్లు మరమ్మతు చేసి, నీటిని సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. మాజీ ఎంపీటీసీ బైరినేని రాము చొరవతో జీపీ కార్యదర్శి నీరజ, సిబ్బంది బోర్లను మరమ్మతు చేయించి కొత్త బోరు మోటర్ బిగించి శుక్రవారం నీటిని సరఫరా చేశారు. దీంతో మహిళలు సంతోషం వ్యక్తం చేశారు.

కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఆరోగ్యశ్రీ సిబ్బంది

వేతనాలు పెంచండి

ఆరోగ్యశ్రీ సిబ్బంది డిమాండ్

కరీంనగర్ విద్యానగర్, సెప్టెంబర్ 20: తమ అర్హతకు తగిన హోదా కల్పించి రెగ్యులరైజేషన్ చేయాలని, వేతనాలు పెంచాలని ఆరోగ్యశ్రీ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కమలాకర్ రెడ్డి మాట్లాడుతూ, ఆరోగ్య మిత్రులకు డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్ కల్పించాలని, జీవో నంబర్ 60 ప్రకారం ₹22,750 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆరోగ్య మిత్రుల జీతభత్యాలు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా కాకుండా నేరుగా ఇవ్వాలన్నారు. వచ్చే పీఆర్సీలో కనీస వేతనం ₹35 వేలకు పెంచడంతోపాటు టీఏ, డీఏ సౌకర్యం కల్పించాలని కోరారు. విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఉద్యోగులందరికీ హెల్త్ కార్డు సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ శ్రీలత, జనరల్ సెక్రటరీ రమేశ్, ట్రెజరర్ అరిగెల రమేశ్, మెంబర్స్ ప్రవీణ్, రామేశ్వర్, కిరణ్, దేవేందర్, నవీన్, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

ఈ బ్రిడ్జిపై వెళ్లేదెలా?

- ఘన్ముక్ల-మల్లన్నపల్లి మధ్య ప్రమాదకరంగా వంతెన

వీణవంక మండలం ఘన్ముక్ల-మల్లన్నపల్లి గ్రామాల మధ్యన ఉన్న ఒర్రెపై సుమారు 16ఏండ్ల క్రితం బ్రిడ్జి నిర్మించారు. ఈ బ్రిడ్జి మీదుగా నిత్యం ఈ రెండు గ్రామాల రైతులతో పాటు ఐదు గ్రామాల ప్రజలు వెళ్తుంటారు. కొద్ది నెలల క్రితం పగుళ్లు చూపిన ఈ బ్రిడ్జి.. ఇటీవల కురిసిన వర్షాలతో పూర్తిగా దెబ్బతినడంతో రైతులు, వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్న నీళ్లలో పడిపోయే ప్రమాదం ఉన్నదని వారు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదకరంగా ఉన్న వంతెనపై ప్రయాణం చేసేదేలా.. అంటూ మండిపడుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని వారు వాపోయారు. ప్రమాదాలు జరుగక ముందే ఉన్నతాధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. **- వీణవంక, సెప్టెంబర్ 20**

ఘన్ముక్ల-మల్లన్నపల్లి గ్రామాల మధ్య ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి

మహిళా స్వావలంబనపై చిన్నచూపు!

- స్వశక్తి సంఘాలతో రూరల్ మార్ట్‌ల ఏర్పాటుపై కేంద్రం నిర్లక్ష్యం
- నాలుగు ప్రతిపాదనలకు ఒక్కటే ఆమోదం

కరీంనగర్ కలెక్టరేట్, సెప్టెంబర్ 20 : ''మహిళలే దేశ ప్రగతిలో కీలకం కాబోతున్నారు. వారికి ఆర్థిక స్వావలంబన కల్పిస్తే దేశం మరింత ముందుకు సాగుతుంది.'' అని రెండేళ్ల క్రితం అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు ప్రధాని నరేంద్ర మోదీ మహిళాలోకాన్ని ఉద్దేశించి చేసిన ఈ వ్యాఖ్యలు మాటలకే పరిమితమయ్యాయి. స్వశక్తి సంఘాల మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే క్రమంలో వారితో మండల కేంద్రాల్లో రూరల్ మార్ట్‌లు ఏర్పాటు చేయిస్తామంటూ ఆ సభలో అట్టహాసంగా ప్రకటించారు. అయితే, ఆచరణలో మాత్రం నామ్‌కే వాస్తే అన్నట్లుగా వ్యవహరిస్తుండడంతో జిల్లా మహిళల్లో కేంద్రం తీరుపై అసంతృప్తి పెల్లుబికుతోంది. రూరల్ మార్ట్‌ల పేర మండల కేంద్రాల్లో సూపర్ మార్కెట్లు ఏర్పాటు చేసేందుకు జిల్లా నుంచి పంపిన ప్రతిపాదనల్లో ఒక్క శాతమే అంగీకరించి రుణం మంజూరు చేయగా, మిగతా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నికలకు ముందు ఓ మాట, తర్వాత మరో మాట అన్నట్లుగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తూ, తమకు అనుకూలంగా ఉన్న ఉత్తర ప్రాంతానికే పెద్దపీట వేస్తుండడంపై మహిళల నుంచి అసహనం వ్యక్తమవుతోంది. కేంద్రం అనుసరిస్తున్న వైఖరి తెలంగాణ మహిళలపై

చిన్న చూపు చూస్తుందనే అంశం స్పష్టమవుతోందంటూ స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు వెల్లడిస్తున్నారు. పేదరికంతో కొట్టుమిట్టాడుతూ దినసరి కూలీ చేసుకునే స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పిస్తూ, వారిని చిరు వ్యాపారులుగా అభివృద్ధి చేస్తామంటూ కేంద్రం గతంలోనే ప్రకటించింది. ఇందుకనుగుణంగా ఔత్సాహిక మహిళా సంఘాలను ఎంపిక చేసి, జాబితా అందజేయాలంటూ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)కు ఆదేశాలు జారీ చేసింది. నాబార్డ్ ద్వారా రూ.1.50 లక్షల రుణ సాయమందిస్తామంటూ ప్రకటించింది. దీంతో, జిల్లాల అధికారులకు ఎంపిక బాధ్యతలు అప్పగించగా, జిల్లాలో ప్రయోగాత్మకంగా నాలుగు మండలాల్లో నాలుగు సంఘాలను ఎంపిక చేసి, ప్రతిపాదనలు పంపారు. కరీంనగర్, మానకొండూర్, చొప్పదండి, గన్నేరువరం మండలాల్లో మండల సమాఖ్యల ద్వారా రూరల్ మార్ట్‌లు నిర్వహించనున్నట్లు ప్రతిపాదనల్లో పేర్కొనగా, కేవలం ఒక్క కరీంనగర్ మండలానికి మాత్రమే నాబార్డ్ ముందుగా అవకాశం కల్పించింది. మిగతా మూడు మండలాల్లో కూడా ఏర్పాటు ఈ మార్టులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామంటూ పేర్కొన్నా, ఇప్పటివరకు మహిళా సమాఖ్యల ప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రాలకు నిధులు పారదర్శకంగా విడుదల చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం కేవలం కొన్ని రాష్ట్రాలకే పరిమితం చేస్తూ, మిగతా రాష్ట్రాలకు అంతంతమాత్రంగానే విడుదల చేస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మహిళాభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా, చేతల్లో పాటించేలా ఉండాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కరీంనగర్: కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

తెలంగాణచౌక్, సెప్టెంబర్20: రాష్ట్ర ప్రభుత్వానికి కార్మికుల సంక్షేమంపై చిన్నచూపు చూస్తున్నదని భవన నిర్మాణ కార్మికులు మండిపడ్డారు. కార్మికుల సంఘాల నాయకులతో చర్చించకుండా ప్రైవేట్ కంపెనీలకు టెండర్లు అప్పగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ మేరకు భవన నిర్మాణ కార్మిక సంఘాల నాయకులతో కలిసి శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినదించారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, సంక్షేమ పథకాలను వెల్ఫేర్ బోర్డు ద్వారా అందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా అమలు చేస్తున్న సహజ మరణం, శాశ్వత, పాక్షిక అంగవైకల్యం పథకాలను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు టెండర్ల ద్వారా అప్పగించడాన్ని వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో 21లక్షల మంది భవన నిర్మాణ కార్మికులుంటే.. 16లక్షల మంది ఉన్నట్లు ప్రభుత్వం చూపుతున్నదని విమర్శించారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులను ఇతర కార్మికులకు ఎలా వర్తింపజేస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా బోర్డు నిర్ణయాలు లేకుండానే నిధులను ఇతర శాఖలకు కేటాయిస్తున్నదని ఆరోపించారు. ప్రభుత్వం తన వైఖరిని మార్చుకునే వరకు పోరాటాలు చేపడుతామని హెచ్చరించారు. ధర్నాలో సీఐటీయూ నాయకులు రమేశ్, తిరుపతి, బీఆర్‌టీయూ నాయకుడు రాములు, కార్మికులు పాల్గొన్నారు.

22న 'కరీంనగర్ హాఫ్ మారథాన్'

కొత్తపల్లి, సెప్టెంబర్ 20 : కరీంనగర్ రన్నర్స్ సైక్లిస్టుల సంఘం (కేఆర్‌సీఏ) ఆధ్వర్యంలో ఈ నెల 22న కరీంనగర్‌లో రెండో ఎడిషన్ ' కరీంనగర్ హాఫ్ మారథాన్'ను నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు పసుల మహేశ్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం అంబేద్కర్ స్టేడియంలో ఆయన జిల్లా యువజన, క్రీడాశాఖాధికారి శ్రీనివాస్‌గౌడ్, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ మార్కెటింగ్ పద్మావతితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. 'రన్ ఫర్ హెల్త్', 'సే నో టూ డ్రగ్స్' అనే నినాదంతో పాటు నగరవాసులకు ఫిట్‌నెస్‌పై అవగాహన, ఆరోగ్య కరీంనగర్ లక్ష్యంగా ఈ హాఫ్ మారథన్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మారథాన్ 3, 5, 10, 21 కిలోమీటర్ల మేర నాలుగు కేటగిరీలుగా సాగుతాయన్నారు. ఈ మారథాన్‌లో పాల్గొనేందుకు ఇప్పటివరకు సుమారు 5వేల మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారని చెప్పారు. ఈ మారథాన్ కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియం నుంచి ప్రారంభమై భగత్‌నగర్, కలెక్టరేట్, ప్రతిమ మల్టిప్లెక్స్, గీతాభవన్, పద్మానగర్ మీదుగా మానేరు డ్యాం నుంచి తిరిగి అంబేద్కర్ స్టేడియానికి చేరుకుంటుందన్నారు. మారథాన్‌లో పాల్గొనే వారందరికీ టీషర్ట్ అందజేస్తామన్నారు. సమావేశం అనంతరం మారథాన్‌లో పాల్గొనే వారి టీ షర్ట్స్‌ను విడుదల చేశారు.

టీ షర్ట్స్‌ను విడుదల చేస్తున్న జిల్లా అధికారులు, మారథాన్ నిర్వాహకులు

బ్యూటీషియన్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 20 : జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో బ్యూటీషియన్ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ యాంసాని సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను కళాశాలలో ఈ నెల 23 నుంచి 28వ తేదీ వరకు అందజేయాలని, అక్టోబర్ 16 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. 16 సంవత్సరాల పైబడి, పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, నిపుణుల ద్వారా తరగతుల బోధన ఉంటుందని వివరించారు.

మళ్లీ గుడుంబా గుప్పు

రహస్య ప్రాంతాల్లో తయారీ కేంద్రాలు

- ఎక్సైజ్ దాడుల్లో బయట పడుతున్న స్థావరాలు
- 2017లో ఉమ్మడి జిల్లాలో 99 శాతం నిర్మూలన
- సత్ఫలితాలు ఇచ్చిన గత ప్రభుత్వ పునరావాస పథకం
- పల్లెల్లో మళ్లీ చెలరేగుతున్న తయారీ దారులు
- 8 నెలల్లో 74 కేసులు.. 8 మంది అరెస్ట్



పచ్చటి పల్లెల్లో గుడుంబా మళ్లీ గుప్పుమంటున్నది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అనేక ప్రాంతాల్లో విచ్చల విడిగా తయారు చేస్తున్నట్లు తెలుస్తున్నది. మరికొన్ని రోజుల్లో దసరా పండుగ వస్తున్న నేపథ్యంలో తయారీదారులు మరింత రెచ్చిపోతున్నట్లు తెలుస్తుండగా, పరిస్థితి ఇలాగే కొనసాగితే పదేళ్ల ముందటి పరిస్థితులు పునరావృతమయ్యేలా కనిపిస్తున్నాయి. గుడుంబా తయారీని ఒక సామాజిక సమస్యగా గుర్తించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం పునరావాస పథకాన్ని అమలు చేసి, తయారీదారులకు బతుకుదెరువు చూపింది. మళ్లీ తయారు చేసిన వారిపై కఠినంగా వ్యవహరించింది. అయితే, ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో తయారీదారులు తిరిగి తమ పాత వృత్తికి నైపుణ్యం పెడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇటీవల మానకొండూర్ మండలం నిజాయితీగూడెంలో గుడుంబా స్థావరంపై దాడి చేసిన ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ టీం

కరీంనగర్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గుడుంబా తయారీ ఒక కుటీర పరిశ్రమగా ఉండేది. గుట్టలు, అటవీ ప్రాంతాలు, వ్యవసాయ బావులు, ఇతర రహస్య ప్రాంతాల్లో గుట్టుగా గుడుంబా తయారు చేసి విక్రయించే వారు. అత్యంత ప్రమాదకరమైన ఈ మత్తు పానీయాన్ని తాత్కాలిక మత్తు కోసం తాగిన అనేక మంది మృత్యువాత పడ్డారు. వందల సంఖ్యలో అనారోగ్యం పాలై బతికున్న శవాలుగా మారిపోయారు. ఈ పరిస్థితిని అర్థం చేసుకున్న తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ సమస్యను సామాజిక కోణంలో పరిశీలించారు. జీవనోపాధి కోసమే కొందరు గుడుంబా తయారు చేస్తున్నారని గుర్తించారు. వీరికి పునరావాసం కల్పించాలనే లక్ష్యంతో 2017 మార్చిలో 216 జీవో తెచ్చారు. దీని ప్రకారం అప్పట్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్సైజ్ అధికారులు సర్వే నిర్వహించారు. కరీంనగర్‌లో 109, జగిత్యాలలో 127, పెద్దపల్లిలో 102, సిరిసిల్లలో 38 చొప్పున మొత్తం 376 గ్రామాల్లో 412 కుటుంబాలు గుడుంబా కాస్తున్నట్లు గుర్తించారు. ఒక్కొక్కరిపై పదుల సంఖ్యలో కేసులు నమోదు చేసినా, జైళ్లకు పంపించినా తిరిగి అదే వృత్తిగా గుడుంబా తయారీ చేయడాన్ని గుర్తించి, వారిలో ఎలాగైనా మార్పు తేవాలని భావించారు. అందుకోసం పునరావాస పథకాన్ని అమలు చేసి, ప్రత్యామ్నాయ ఉపాధికి బాటలు వేశారు. కరీంనగర్‌లో 77, జగిత్యాలలో 159, పెద్దపల్లిలో 118, సిరిసిల్లలో 58 కుటుంబాలకు 172 పాడి యూనిట్లు, 138 కిరాణా దుకాణాలు, 14 లేడీస్ ఎంపోరియంలు, 10 ఆటోమొబైల్ షాపులు, 25 టెంట్‌హౌస్‌లు, ఇతరంగా మరో 48 యూనిట్లను నెలకొల్పుకొనేందుకు ఒక్కో కుటుంబానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ₹2 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించింది. దీంతో వారు ప్రత్యామ్నాయ ఉపాధి పొందుతూ జీవనం సాగిస్తూ వచ్చారు. అంతే కాకుండా, అప్పటి ప్రభుత్వం గుడుంబా తయారీపై ఉక్కుపాదం మోపింది. దీంతో అటు వైపు కన్నెత్తి చూసేందుకు జంకేలా చేసింది. ఈ నేపథ్యంలో రెండేళ్లలో కరీంనగర్‌లో 100, జగిత్యాలలో 99, సిరిసిల్లలో 98, పెద్దపల్లిలో 96 శాతం గుడుంబా తయారీని నిర్మూలించినట్లు అప్పట్లో ఎక్సైజ్ అధికారులు ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చారు. ఆరేడేళ్లపాటు ఇదే పరిస్థితి కొనసాగింది.

మళ్లీ విచ్చలవిడిగా..

పునరావాస పథకం అమలై ఏడేళ్లు గడుస్తున్నాయి. వివిధ వ్యాపారాలు చేసుకుంటున్న గుడుంబా తయారీదారులు మళ్లీ దారి తప్పుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో కేసులు పెట్టి జైల్లో పెట్టడం, తహసీల్దార్ల వద్ద బైండోవర్లు చేయడం, రెండు, మూడు సార్లు దొరికితే పెద్ద మొత్తంలో జరిమానాలు విధిస్తామని హెచ్చరించిన నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ కొంత వరకు గుడుంబా తయారీని అరికట్టగలిగింది. ప్రభుత్వం మారడంతో తయారీదారులు మళ్లీ విజృంభిస్తున్నారు. రెండు మూడు నెలలుగా మరీ రెచ్చి పోతున్నారు. ఎక్కడపడితే అక్కడ గుడుంబాను తయారు చేస్తున్నారు. ఏడెనిమిది నెలల్లో వచ్చిన మార్పును గమనిస్తే 2017 ముందు పరిస్థితులు పునరావృతమవుతున్నాయనే అనుమానాలు వస్తున్నాయి. కరీంనగర్ జిల్లాలోని శంకరపట్నం మండలం అంబాల్‌పూర్, సైదాపూర్ మండలం రాయికల్ తండా, ఘనపూర్ తండా, తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం, రామడుగు మండల కేంద్రంతోపాటు ఇదే మండలంలోని తిర్మలాపూర్, చిగురుమామిడి మండలం రేకొండ, చొప్పదండి మండలం రాఘంపేట వీణవంక మండలం చల్లూరు, కల్వల, మానకొండూర్ మండలం నిజాయితీగూడెం గ్రామాల్లో రహస్యంగా గుడుంబా తయారు చేస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. జగిత్యాల లోని రాయికల్, పెగడపల్లి, పెద్దపల్లి జిల్లాలోని సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్, గోదావరిఖని సిరిసిల్ల జిల్లాలోని ఎల్లారెడ్డిపేట, తదితర మండలాల్లో గతంలో మాదిరిగానే గుడుంబా గుప్పుమంటోంది. ఆయా జిల్లాల ఎక్సైజ్ అధికారులు నిత్యం నిఘా పెట్టి దాడులు చేస్తున్నా గుడుంబా తయారీ మాత్రం ఆగడం లేదు..

ముడి సరుకు ఎక్కడిది?

గుడుంబా తయారీకి ప్రాణాలకు హాని చేసే మత్తు పదార్థాలను వాడుతున్నారు. బెల్లం, పటిక, జీడి గింజలు, నాగస్వరం బిల్లలు వంటివే కాకుండా పైరుకు ఎరువుగా వాడే యూరియాను వాడుతున్నట్లు తెలుస్తున్నది. గతంలో విక్రయదారుల నుంచి 5 కిలోల కంటే ఎక్కువ బెల్లం కొనుగోలు చేసినా వారి వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉండేది. వాటిని ప్రతి నెలా ఎక్సైజ్ పోలీసులకు ఇవ్వాల్సి ఉండేది. కానీ, ఇప్పుడు ఆ ఆంక్షలు లేకుండా పోయాయి. ఎక్కడపడితే అక్కడ విచ్చల విడిగా విక్రయిస్తున్నారు. పెద్ద మొత్తంలో తెప్పించుకునే వారు మహారాష్ట్ర, తదితర ప్రాంతాల నుంచి రైలు మార్గంలో తెచ్చుకుంటున్నట్లు తెలుస్తున్నది. ఇటీవలి కాలంలో గుడుంబా తయారీకి సిద్ధం చేసిన 16,935 లీటర్ల బెల్లం పానకాన్ని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారంటే ఎంత విచ్చల విడి తనం పెరిగి పోయిందో అర్థం చేసుకోవచ్చు. మరికొన్ని రోజుల్లో దసరా వస్తున్న నేపథ్యంలో తయారీదారులు పెద్ద మొత్తంలో గుడుంబా తయారు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు తెలుస్తున్నది. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో రెండు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లు, జిల్లాకు ఒక టాస్క్‌ఫోర్స్‌టీం ఉన్నాయి. గుడుంబా స్థావరాలపై ఈ టీములు నిరంతరం నిఘా పెట్టినప్పటికీ అనేక రహస్య ప్రదేశాల్లో గుడుంబా తయారవుతున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. గత ప్రభుత్వ మాదిరిగా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని, లేదంటే ఎందరో అమాయకులు గుడుంబా రక్కసికి బలికాక తప్పదనే వాదనలు వినిపిస్తున్నాయి.

క్రీడా సమాఖ్య కార్యదర్శిగా మధుజాన్సన్

కొత్తపల్లి, సెప్టెంబర్ 20 : ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎస్జీఎఫ్ అండర్-19 జూనియర్ కళాశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శిగా జీ మధుజాన్సన్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జీ జగన్‌మోహన్‌రెడ్డి నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఆర్ట్స్, కామర్స్) ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను 2023-24 సంవత్సరానికి క్రీడా సమాఖ్య కార్యదర్శిగా నియమించారు. కాగా, ఆయనను జూనియర్ కళాశాలల చైర్మన్లు, క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాశాఖాధికారులు అభినందించారు.

ఒత్తిడి తట్టుకోలేక

- పాఠశాల భవనంపై నుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం
- చికిత్స కోసం దవాఖానకు తరలింపు
- వీర్నపల్లి కేజీబీవీలో ఘటన

వీర్నపల్లి, సెప్టెంబర్20: మానసిక ఒత్తిడి తట్టుకోలేక పాఠశాల భవనంపై నుంచి దూకి ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికుల వివరాల ప్రకారం.. వీర్నపల్లి మండలంలోని బండేరుకు చెందిన పర్లపల్లి శ్రీనివాస్-మంజుల దంపతుల కూతురు అశ్విత(14) వీర్నపల్లి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఎనిమిదో తరగతి చదువుతున్నది. శుక్రవారం సాయంత్రం పాఠశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. తోటి విద్యార్థినులు గమనించి కేకలు వేయగా, సిబ్బంది వెంటనే చికిత్స కోసం ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతున్న విద్యార్థినిని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ పరామర్శించి, కారణాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో చదవడం ఇష్టం లేకుంటే టీచర్లకు లేదా తల్లిదండ్రులకు చెప్పాలని, ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని సూచించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేని రంజిత్ కూడా విద్యార్థినిని పరామర్శించారు. కాగా, కొన్ని రోజులుగా విద్యారినులను తమతో ఫోన్‌లో మాట్లాడిస్తలేరని.. దీంతో వారు మానసిక వేదనకు గురవుతున్నారని వారి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

కవలలను దూరం చేసిన జ్వరం

- ఇద్దరిలో ఒకరు మృతి
- తల్లిదండ్రులకు పుట్టెడు దుఖం

మనీశ్(ఫైల్)

రాయికల్, సెప్టెంబర్ 20 : ఆ ఇద్దరూ కవల సోదరులు.. ఆరేళ్లు.. నాలుగు రోజుల క్రితం వరకు తమ అల్లరితో సందడి చేశారు. కానీ, అంతలోనే విధి వెక్కిరించింది. ఆ ఇద్దరిలో ఒకరిని దూరం చేసింది. జ్వరంతో ఒకరు ప్రాణాలు కోల్పోవడం విషాదం నింపింది. కుటుంబస భ్యుల కథనం ప్రకారం.. రాయికల్ పట్టణం ఇంద్రానగర్ కాలనీకి చెందిన రాస శేఖర్-లాస్య దంపతులకు కవల కొడుకులు మనీశ్, మానస్. యూకేజీ తరగతి చదువుతున్న ఈ ఇద్దరు పిల్లలు ఎంతో చలాకీగా ఉండేవాళ్లు. నాలుగు రోజుల క్రితం ఇద్దరికి ఒకేసారి జ్వరం రావడంతో జగిత్యాలలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చేర్పించారు. శుక్రవారం పెద్ద కొడుకు మనీశ్‌కు తీవ్ర జ్వరం రావడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలిస్తుండగా మృతి చెందాడు. దీంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. దేవుడా ఎంత పనిచేశావంటూ విలపిస్తున్నారు.